


# మంచు తెరలు

సుచరిత ధోరణి ఏమిటో అర్థం కావడం లేదు శంకర్‌కి. పెళ్ళయిన కొత్తలో ఇద్దరూ ఒకే కంపెనీలో పని చేసేవారు. తర్వాత చెరొక కంపెనీలో చేరాల్సి వచ్చింది. దూరమయ్యారు. మనసులుగూడా దూరమైనట్లు ఫీలవుతున్నాడు శంకర్. పెళ్ళయి మూడేళ్ళు. ఇప్పుడే పిల్లలు వద్దంటుంది?

"ఇద్దరం జాబ్ చేస్తున్నాం శంకర్. పిల్లల్నికంటే క్రెచ్‌లో పడేయాల్సి వస్తుంది. అది నాకు ఇష్టం లేదు" అని నిర్మొహమాటంగా చెప్పింది.

"అందరూ చేస్తున్నదే! మనం చేస్తే తప్పేంటి?" అన్నాడు శంకర్.

"పిల్లల్ని కని క్రెచ్‌లో పడేసి జాబ్‌కి వెళ్ళడం తప్పు మాత్రమే కాదు నేరం కూడా!" తీవ్రంగా అన్నది సుచరిత.

"ఫూలిష్‌గా మాట్లాడకు చరితా! మనది అసలే లేట్ మ్యారేజి. ముప్ఫై ఏళ్ళు దాటిపోయిన వాళ్ళం. ఇలాగే పిల్లల్ని కనడం వాయిదా వేసుకుంటూ పోతే, తర్వాత ప్రెగ్నెన్సీ వచ్చే ఛాన్స్ వుండదేమో?" కోపంగా అన్నాడు శంకర్.

"అందుకని బాధ్యత లేకుండా బిహేవ్ చెయ్యలేం కదా?" అన్నది.

"బాధ్యతా? అదేంటి?"

"పిల్లల్నికన్న తర్వాత పెంచడమే బాధ్యత. క్రెచ్‌లో వేసో ఆయాల దగ్గరో పడేయడం బాధ్యతారాహిత్యం. అలా చేసే బదులు అసలు పిల్లలు వద్దనుకోవడం వుత్తమం"

"చరితా! నీ మాటలు నాకేం అర్థం కావడం లేదు"

"ఇందులో అర్థంకాకపోవడానికి ఏముంది? పిల్లల్ని కన్న తర్వాత వాళ్ళ ఆలనా పాలనా నేనే చూడాలి. వాళ్ళని నా వళ్ళో పెంచాలి. నేనెట్లా మా అమ్మ దగ్గర పాలు తాగానో, గోరుముద్దలు తిన్నానో, ఆడుతూ పాడుతూ స్వేచ్ఛగా పెరిగానో అటువంటి బాల్యం నా పిల్లలకు ఇవ్వడం నా బాధ్యత" చెప్పింది సుచరిత.

"అంటే నీకు పిల్లల్నికనే వుద్దేశ్యం లేదన్నమాట"

"ఎందుకు లేదూ?"

"ఇంకెప్పుడు?"

"నేను జాబ్ మానేసిన తర్వాత"

"మానెయ్! ఎవరొద్దన్నారు? ఇద్దరం జాబ్ చేస్తూ మనం సుఖపడుతున్నది మాత్రం ఏం వుంది?" అక్కసుగా అన్నాడు శంకర్.

"మరి నీ బాధ్యతో?" అడిగింది సుచరిత.

"నాకు నా బాధ్యత తెలుసు. నువ్వేం గుర్తుచెయ్యనవసరం లేదు"

"నీ చెల్లెలి పెళ్ళి చెయ్యి. రెస్పాన్స్‌బులిటీ నుంచి రిలీవ్ అవుతావు. నేను జాబ్‌కి రిజైన్ చేస్తాను"

శంకర్ గతుక్కుమన్నాడు. ఊళ్ళో తల్లి, చెల్లెలు వున్నారు. చెల్లెలు పెళ్ళి చేస్తానని తండ్రికి చివరిరోజుల్లో వాగ్దానం చేశాడు.

"చెప్పు శంకర్! ఇప్పుడు మనకున్న సేవింగ్స్‌తో పెళ్ళి చెయ్యగలమా?" అడిగింది సుచరిత.

శంకర్ మౌనంగా వుండిపోయాడు.

* * *

కాలం గడిచిపోతోంది. శంకర్ చెల్లెలు పద్మ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయింది. పెళ్ళిసంబంధాలు కుదరడం లేదు. ఉద్యోగం యాంత్రికంగా సాగుతుంటే, సంసారంగూడా అంతే మెకానికల్‌గా వుండడంతో శంకర్‌కి విసుగ్గా వుంది. దాంపత్యజీవితం సజావుగా సాగడం లేదు. అతనికి మూడొచ్చినప్పుడు ఆమె వంట్లో బాగా లేదంటుంది. ఆమె తెల్ల చీరకట్టుకుని మల్లెపూలు పెట్టుకుని తను రెడీ అని సంకేతాలు ఇచ్చినప్పుడు అతనికి చచ్చేంత నీరసంగా వుంటుంది. అలసటగా వుంది. "ఇప్పుడు కాదులే" అని బెడ్‌మీద పడిపోతాడు.

ఏ పనికైనా కాలం కలిసి రావాలనేది నిజమే అయినా శంకర్ విషయంలో ఏ పనీ సానుకూలపడడం లేదు. పద్మ పెళ్ళి ఖర్చులకి వూళ్ళో పొలం అమ్ముదామంటే తల్లి ససేమిరా అంటుంది.

"అమ్ముకుంటే నాకేం ఆధారం? తర్వాత చివరివరకు మీరు నన్ను చూస్తారన్న గ్యారెంటీ ఏమిటి? అయినా ఆ పొలం మీ నాన్న స్వార్జితం కాదు. నాకు పుట్టింటివాళ్ళు పసుపుకుంకుమల కింద ఇచ్చారు" అని అపనమ్మకంగా అంటుంది.

చెల్లెలి పెళ్ళి బాధ్యత అంతా నీదే అన్నట్లు ప్రవర్తిస్తుంది. ఆమెను ఒప్పించడం అతనివల్ల కావడం లేదు.

ఇక పద్మ పెళ్ళయ్యేది ఎప్పుడు? సుచరిత జాబ్‌కి రిజైన్ ఇచ్చేది ఎప్పుడు? తను పిల్లల్ని కనేది ఎప్పుడు? పిల్లలతో సంతోషంగా గడిపేది ఎప్పుడు?

శంకర్ ముందు అన్నీ ప్రశ్నలే!

కొలీగ్స్ తమ పిల్లల బర్త్‌డే ఫంక్షన్ అని పిలిచినప్పుడు అతని బాధ రెట్టింపు అవుతుంది.

తనలాగే ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకున్న జంటల మధ్య సయోధ్య వుండడం లేదు. తమలాగే ఏవేవో సమస్యలతో ఘర్షణపడడం సర్వసాధారణమైంది. సగానికి సగం లవ్‌మ్యారేజీలు ఫెయిలైపోతున్నాయి. కొందరు పెళ్ళయిన సంవత్సరంలోపునే విడాకుల కోసం కోర్టులకు ఎక్కుతున్నారు. ఆ గొడవలన్నీ చూసి కొన్ని జంటలు లివ్ ఇన్ అంటూ పెళ్ళికాకుండా కలిసి కాపురం చేస్తున్నారు. అదొక లాటరీగా తయారైంది. ఇద్దరూ కలిసి జీవితాంతం వుండగలమని నమ్మకం కుదిరితే పెళ్ళి చేసుకుంటారట. లేకపోతే విడిపోతారట. అలా విడిపోతున్నారు గూడానూ. పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. ఎవరికీ సంతృప్తిలేదు. సుఖశాంతులు లేవు. ఏ సంసారంలో ఏ వుపద్రవం వస్తుందో? ఎప్పుడు విడిపోతారో ఎవరికీ తెలియదు. అటువంటి సంఘటనలు విన్నప్పుడు శంకర్‌కి కలవరం కలుగుతోంది.

తన తండ్రి కాలానికీ ఇప్పటికీ ఎంతో మార్పు కనిపిస్తోంది. అప్పటిలా భార్యల మీద పెత్తనం చెలాయిస్తే వూరుకోవడం లేదు. ఉద్యోగం వున్నవాళ్ళయితే మరీను. తమకి ఆర్థిక స్వాతంత్ర్యం వుండడం వల్లనో ఏమో, స్త్రీవాద సాహిత్య ప్రభావమో? చిన్న చిన్న విషయాలు కూడా సహించడం లేదు. ఘర్షణ పడుతున్నారు. అల్ప

మైన సంఘటనలకు కూడా విడాకులు కావాలంటున్నారు.

అటువంటి ప్రమాదం తన సంసారంలో గూడా జరుగుతుందేమోనని శంకర్ బెంబేలెత్తిపోతున్నాడు. సుచరిత ధోరణి అలా వుంది మరి.

* * *

అతను భయపడినంతా జరిగింది.

ఒకరోజు సుచరిత కారు ఫ్రంట్ సీట్లో కూర్చుని డ్రైవింగ్ చేస్తున్న అతనితో నవ్వుతూ మాట్లాడడం అతని కళ్ళబడింది. అది క్యాబ్ కాదు. అతను డ్రైవర్ కాదు.


ఆఫీసునుంచి ఇంటికి రాకుండా కారులో షికార్లు ఏమిటి? అతను ఎవరు? ఇద్దరూ కలిసి ఎక్కడికి వెళ్ళారు? అతని మనసు అల్లకల్లోలమైన తుపాన్ నాటి సముద్రంలా వుంది. భర్త మీద మోజుతీరి, పరాయి మగాడితో సంబంధాలు పెట్టుకున్నవాళ్ళు, తనను సుఖపెట్టడం లేదనీ, కోర్కెలు తీర్చడం లేదనీ విడాకులు తీసుకుని మరొకరితో డేటింగ్ చేస్తున్న ఆడవాళ్ళు అతని మదిలో మెదిలారు. తమ జీవితంలో కూడా అటువంటి మార్పు సంభవిస్తోందా? ఏమో? ఎవరు చెప్పగలరు? తమ జీవితం కూడా దేనికీ అతీతం కాదు.

సుచరిత కూడా అంతకంటే మెరుగైన జీవితం కోసం వెంపర్లాడుతోందా? తననుంచి దూరంగా జరుగుతున్నదా? అందుకే బాధ్యత అనే మంత్రం పఠిస్తూ పిల్లల్ని కనడానికి ఒప్పుకోవడం లేదా? ముందు చెల్లెలు పెళ్ళి చెయ్యి అనే సవాలు తనముందు వుంచి తమాషా చూస్తున్నదా?

శంకర్ మనసు అనేక అనుమానాలతో మొద్దుబారిపోయింది. మనిషికి అనుమానం కలగకూడదు. భాగస్వామిమీద నమ్మకం వుండాలి. ఆ నమ్మకం సడలితే అనుమానం పెనుభూతమవుతుంది. నాగరీకులు విడాకులు తీసుకుంటారు. అనాగరికులు ఆవేశంతో హత్యల వరకూ వెళ్ళి జీవితం నరకం చేసుకుంటారు.

శంకర్ ఆ రోజు ఆఫీసుకి వెళ్ళలేదు. ఆమె ఇంటికొచ్చే సమయానికి అతను ఇంట్లో వుండడు. ఆలస్యంగా ఇంటికొచ్చిన సుచరిత అతను ఇంట్లో వుండడం చూసి ఆశ్చర్యపోయింది.

"శంకర్! ఆఫీసుకెళ్ళలేదేం?" ఫ్రెషయ్యి వచ్చి ఎప్పటికో అతన్ని పలకరించింది.



అంతేగాని తను ఆలస్యంగా ఇంటికి వచ్చిన కారణం మాత్రం చెప్పలేదు. అతను కూడా ఆ మాట ఎత్తలేదు.

"నాట్ ఫీలింగ్ వెల్" అన్నాడు ముభావంగా.

"ఫీవర్ ఏమైనా వచ్చిందా?" అని అతని బుగ్గలకు చేతిని ఆనించింది.

"ఫీవర్ వున్నట్లు లేదు. ఎందుకైనా మంచిది కాలనీలో డిస్పెన్సరీకి వెళ్దాం పద" అన్నది.

"అవసరం లేదులే" అని అతను హాల్లోనే సోఫాలో పడుకున్నాడు.

బెడ్‌రూమ్‌లోకి వెళ్ళలేదు. సుచరిత అతన్ని రమ్మని పిలవలేదు.

అతనికి లోపల ఏదో కసిగా వుంది. గుండెల్లో ఆవేదన మండిస్తోంది. సుచరితమీద ఎంతో కోపంగా వుంది. తను ఎవరితోనో కారులో వెళ్ళడం చూశాడని ఆమెకు తెలియదు. తెలిస్తే ఏదో ఒడా కుంటిసాకు చెప్పి వుండేది. ఇప్పుడు ఏమీ ఎరగనట్లు మామూలుగా ప్రవర్తిస్తోంది.

శంకర్‌కి నిద్రపట్టడం లేదు. ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. ప్రేమించి పెళ్ళి చేసుకున్న సుచరిత తన నుంచి ఎందుకు దూరంగా జరుగుతోంది? లవ్

మ్యారేజీ కాబట్టే ఫెయిలవుతున్నదా? పెద్దలు కుదిర్చిన పెళ్ళయితే స్థిరంగా వుండేదా? పెళ్ళయి ఇన్నేళ్ళయిన తర్వాత పరాయి మగాడితో షికార్లు ఏమిటి? తను నిలదీస్తే? ఆమెకు కోపం వస్తుందా? 'నా ఇష్టం' అని ఎదురు తిరుగుతుందా? 'నీతో బోర్ కొట్టింది శంకర్! స్వంత ఇల్లు లేదు. కారు లేదు. ఏం జీవితం? ఇక నీతో కలిసి వుండలేను. గుడ్ బై' అని వెళ్ళిపోతుందా?

ఇప్పుడు ఆలోచిస్తుంటే సుచరిత ప్లాన్డుగా మొదటి నుంచి ప్రవర్తిస్తున్నట్లుగా అనుమానం వచ్చింది. పెళ్ళవగానే ఇంటి అద్దె నువ్వు కట్టు శంకర్. మిగిలింది బ్యాంక్‌లో వేసుకో. నేను ఇంటి మెయింటెనెన్స్ చూస్తాను. మిగిలింది నా ఎక్కౌంట్లో వేసుకుంటా అన్నది. అలాగే జరుగుతున్నది ఇన్నాళ్ళు. ఎప్పుడైనా విడిపోతే ఎవరి డబ్బు వాళ్ళ దగ్గర వుండేట్టు ప్లాన్ అన్న మాట.

శంకర్‌కి తెల్లవారుజామున ఎప్పుడో నిద్రపట్టింది. లేచేసరికి బోలెడు పొద్దెక్కింది. సుచరిత ఇంట్లో లేదు. డ్యూటీకి వెళ్ళిపోయిందన్నమాట. అతనికి వుక్రోషం కలిగింది. కనీసం తనకు ఎలా వుందని కూడా పరామర్శించకుండా పోయిందంటే, తనను కేర్ చెయ్యడం లేదు.

అతని సెల్ రింగైంది.

"శంకర్! నువ్వు డీప్ స్లీప్‌లో వున్నావని లేపలేదు. ఎలావుంది వంట్లో? ఆర్ యు ఆల్ రైట్?" అడిగింది సుచరిత.

"ఐయామ్ ఓ.కె." అన్నాడు కసిగా.

"ఫుడ్ ఛేంజ్ చెయ్యి. లంచ్‌లో అన్నం తినకుండా బ్రెడ్ తిను. సిటీలో వైరల్ ఫీవర్ వుంది. అనీజీగా వుంటే డాక్టర్ దగ్గరికి వెళ్ళు" అన్నది సుచరిత.

'హు..ప్రేమ కారిపోతోంది' అని పళ్ళు కొరుక్కున్నాడు శంకర్.

* * *

శంకర్ ఇక ఆఫీసుకి వెళ్ళడానికి రెడీ అవుతూవుండగా సుచరిత నుంచి కాల్ వచ్చింది.

"శంకర్ ఆఫీసుకు వెళ్ళకు. ఇంట్లో వుండు. గంటలో వస్తాను" చెప్పింది సుచరిత.

"ఏం?" అడిగాడు.

"నీకో సర్‌ప్రైజ్" అన్నది. కాల్ కట్ చేసింది ఎక్కువ చెప్పకుండా.

శంకర్ రెట్టించలేదు. సుచరిత తనకు ఇవ్వబోయే సర్‌ప్రైజ్ ఏమిటా? అని ఆలోచిస్తూ, వరండాలో పచార్లు చేస్తుండగా ఇంటిముందు కారు ఆగింది.

ముందుగా ఫ్రంట్ డోర్ తెరుచుకుని సుచరిత దిగింది. తర్వాత అతను డ్రైవింగ్ సీట్లో నుంచి దిగాడు. అతన్ని చూసి శంకర్ నిర్ఘాంతపోయాడు.

'యస్.. అతనే. నిన్న సుచరితతో కారులో కనపడింది అతనే' గుర్తొచ్చింది శంకర్‌కి.

"ప్లీజ్ కమ్ శ్రీధర్!" అని అతన్ని ఇంట్లోకి ఆహ్వానిస్తూ శంకర్‌వైపు తిరిగి నవ్వింది.

"శంకర్! హీ ఈజ్ శ్రీధర్! మై టీమ్ లీడర్" అని పరిచయం చేసింది. ఇద్దరూ షేక్ హాండ్స్ ఇచ్చుకున్నారు.

ముగ్గురూ లోపలకు వెళ్ళి హాల్లో కూర్చున్నారు.

సుచరిత తన హేండ్‌బ్యాగ్‌లోనుంచి ఒక ఫోటోతీసి శంకర్‌కి అందించింది.

"శంకర్! ఫోటోలో వున్నది వంశీకృష్ణ. శ్రీధర్ బ్రదరిన్లా. ఎమ్మెస్సీ చేసి లెక్చరర్‌గా చేస్తున్నాడు. నిన్న వెళ్ళి అతనికి పద్మ ఫోటో చూపించాను. అతనికి నచ్చింది. పద్మని పర్సనల్‌గా చూసి మాట్లాడతానని అన్నాడు. ఇట్స్ ఓన్లీ ఎ ఫార్మాలిటీ" చెప్పుకుపోతోంది సుచరిత.

శంకర్ విస్మయంతో ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

'ఛీ..ఛీ..ఎంత అన్యాయంగా వూహించాడు. సుచరిత ఎంతో బాధ్యతగా ప్రవర్తిస్తుంటే, తను అనుమానపు మంచుతెరల్లో కూరుకుపోయాడు' మంచుతెరలు నెమ్మదిగా కరిగిపోతున్నాయి.

"శంకర్‌గారూ! మీ ముందు మీ మిసెస్‌ని పొగడకూడదు కానీ చాలా బాధ్యత తెలిసిన మనిషి. సిన్సియర్ వర్కర్. కంపెనీలో చాలామంది డిప్రెషన్లో వుంటున్నారు. వర్క్‌మీద కాన్‌సెన్‌ట్రేషన్ చెయ్యరు. ఎందుకంటే వీళ్ళవి పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళు కావు. ఏదో ఎట్రాక్షన్‌లోపడి ముందూ వెనుకా ఆలోచించకుండా ఏదో ఘనకార్యం చేసినట్లు పెళ్ళిచేసుకుంటారు. ఇద్దరివీ వేళాపాళా లేని జాబ్స్. వత్తిడితో సతమతమవుతారు. సంసారం చెయ్యడానికి టైముండదు. చిన్న విషయాలకే గొడవపడుతుంటారు. సర్దిచెప్పడానికి పెద్దవాళ్ళు ఇంట్లో వుండరు. ఫలితం విడాకులు. మీరు నమ్ముతారో లేదో ఫిఫ్టీపర్సెంట్ లవ్‌మ్యారేజీలు ఫెయిలైపోతున్నాయండీ. అందుకే మా బామ్మర్ది పెళ్ళి బాధ్యత అమ్మా, నాన్నల మీద పెట్టాడు. వాళ్ళేమో నా నెత్తిమీద పెట్టారు" శ్రీధర్ గలగల మాట్లాడుతున్నాడు.

"మాదీ లవ్ మ్యారేజే శ్రీధర్! మేం ఫెయిల్ కాలేదు. కాబోము కూడా!" సుచరిత కాఫీ కప్పు అందిస్తూ అన్నది.

శంకర్ మనస్ఫూర్తిగా నవ్వాడు.

"యు ఆర్ గ్రేట్" అని మెచ్చుకున్నాడు శ్రీధర్.

○



## డిమాండ్ చేయను

కాజల్ అగర్వాల్ కెరీర్ ఇప్పుడు జోరుజోరుగా సాగుతోంది. తన డిమాండ్‌ని బట్టి ఆమె 80 లక్షల నుంచి కోటి వరకూ అడుగుతోందని కూడా చెప్పకుంటున్న మాటలకు కాజల్ స్పందించిందీమధ్య. 'నిజంగా నేను డబ్బే ముఖ్యమని పట్టుపడుతూ కూర్చుంటే ఈరోజున ఇంత బిజీస్టార్‌ని అయ్యేదాన్నా ఆలోచించండి ఒక్కసారి' అంటోంది. పాత్రల్ని జాగ్రత్తగా సెలక్ట్ చేసుకుంటూ సినిమాలు ఒప్పుకుంటున్నానేగానీ, పారితోషికాన్ని ఇష్టంవచ్చినట్టు డిమాండ్ చేయడంలేదు అని తేల్చి, చెబుతోంది కాజల్.